* రక్షణ కొనుగోళ్ళ కుంభకోణంపై
  శ్వేత పత్రాన్ని వెంటనే ప్రచురించాలి
* సభా సంఘాన్ని నియమించాలి

— పార్లమెంటులో వడ్డే డిమాండ్

[1987 ఏప్రియల్ 16 వ తేదీన లోక్‌సభలో
శ్రీ వడ్డే శోభనాద్రీశ్వరరావు చేసిన ప్రసంగం]

0-25

## వడ్డే శోభనాద్రీశ్వరరావు (విజయవాడ)

ఉప సభాపతిగారూ, యిది చాలా ముఖ్యమైన అంశం. చాలా వేగముగా సంభవించుతూవున్న పలు సంఘటనలను దేశం యావత్తూ జాగరూకతతో గమనిస్తూ వుంది. ఒక విదేశీ సంస్థనుండి మనదేశ రక్షణ అవుసరాలకై నాలుగు వందల ముఫై కోట్లు రూపాయల విలువగల పరికరాలను కొనుగోలు చేసిన వ్యవహారంలో ఒక ఎజెంటుకు 7% కమీషను చొప్పున ముఫై కోట్ల రూపాయలు చెల్లించబడ్డాయని తెలిసి దేశ ప్రజలంతా నిర్ఘాంతపోయారు. కొన్ని సందర్భాలలో అర లేక ఒకటి శాతముయని సమాచారం వుండి కాని యీ విధంగా 7% చొప్పున రూ. 30 కోట్లు ఒక ఏజెంటుకు కమీషను యిచ్చిన వుదాహరణ వేరే ఎక్కడా కన్పించదు.

1980 నుండి ఏజెంట్ల ద్వారా వ్యవహారము నడపే విదానానికి స్వస్తి చెప్పామని, కాబట్టి ఏజెంట్లతో తమకు పని లేదని ప్రభుత్వం చెప్పుతూంది. నిన్న మంత్రి గారి ప్రకటనలో యీ విషయం స్పష్టం చేయబడింది. అయినప్పుడు యిది ఏలా జరిగింది? ఒక విదేశీ సంస్థనుండి కొంత రక్షణసామాగ్రి కొనుగోలుకై సంభాషణలు జరుగుతూవున్న తరుణములో, ఆ విదేశీ సంస్థ అప్పటికే కొనుగోలు జరిగిన సామాగ్రి విషయంలో 7% చొప్పున ఒక ఏజెంటుకు కమీషను ముట్టజెప్పినట్లు, యిక కొనవలసిన దానిలో కూడా ఆ ఏజెంటుకు కమీషను యివ్వాలా లేక అవుసరం లేదా అని ఆ దేశములో వున్న మన రాయబారి కార్యాలయమును అడుగగా, ఎంబసీవారు మన ప్రభుత్వానికి యీ సమాచారాన్ని రహస్యంగా అందించారు!

మధ్యవర్తులతో ఏ విధమైన సంబంధములేకున్న మన ప్రభుత్వ విధానానికి భిన్నముగా, ఆ విదేశీ సంస్థ మన దేశంలోకాని, బైట కాని వున్న ఒక వ్యక్తి లేక సంస్థకు రూ. 30 కోట్లు కమీషను యిస్తుందంటే మనం నమ్మగలమా? కాంగ్రెసు(ఐ) పార్లమెంటరీ పార్టీ సమావేశములో వారి నాయకుడు పశ్చిమ జర్మనీకి చెందిన హెచ్.డి.డబ్ల్యు సంస్థ నుండి జలాంతర్గాములను కొన్న విషయం పేర్కొన్నారు. ఈ హెచ్. డి. డబ్ల్యు సంస్థ జలాంతర్గాముల కాంట్రాక్టుకు సంబంధించి భారత దేశములోని ఏ వ్యక్తికి లేదా సంస్థకు తాను కమీషను యివ్వలేదని ప్రకటించింది. కాని ఇతర దేశములో వున్న భారతీయ ఏజెంటు లేక సంస్థకు కమీషను యివ్వ లేదని యీ సంస్థ చెప్పలేదు!

అత్యున్నత స్థానములలోని వ్యక్తుల ఆమోదము, పరోక్ష సహకారము లేనిదే ఒక ఏజెంటు విదేశీ ఉత్పత్తిదారుని ఎట్లా ప్రలోభపరచగలిగాడు ? ఎట్లా 7% కమీషను పొందగలడు ? అతని నుండి ఏమీ లాభము లేకుండా కోట్లాది రూపాయలు ఆ సంస్థ ఎందుకు యిస్తుంది ?ఒక్క వ్యక్తే రూ. 30 కోట్లు జీర్ణము చేసుకోగల్గాడా? అతనితో పాటు ప్రయోజనం పొందిన భాగస్వాములు యింకా ఎందరున్నారు ? ఎవరు వారు ? ఈ కాంట్రాక్టు ఎప్పుడు కుదుర్చుకోబడింది ? ఎవరితో ? ఈ ఏజెంటు ఎవరు? ఆ ఏజెంటుకు ఎంత సొమ్ము ముట్టింది ? రక్షణశాఖ కొనుగోళ్ళలో దళారీలకు ప్రమేయం లేదనే స్పష్టమైన విధానం వున్నా యీ ఏజెంటుకు ఆ సంస్థను ఎట్లా ప్రభావితం చేయగలిగాడు ?ఈ ప్రశ్నలకు సమాధానం యివ్వవలసిన బాధ్యత ప్రభుత్వంపై వుంది.

ఆందోళన కల్గించే మరికొన్ని వార్తలు మనం చూస్తున్నాం. 1986 మే 27 ఎకనామిక్ టైమ్సులో షుమారు రూ. 1100 కోట్లు విలువకల ఎక్కువ దూరము లక్ష్యముకల తుపాకులు కొనుగోలు గురించి చాలా తీవ్రమైన ఆందోళన, అనుమానం వ్యక్తమయింది. 30 కి.మీ దూరము లక్ష్యముకొట్టగల తుపాకులు మనకు అవసరంకాగా స్వీడనుకు చెందిన బొఫర్సు సంస్థ యిచ్చిన తుపాకులు లక్ష్యము 15 కి. మీమాత్రమే వారికే మరలా అవకాశం యివ్వగా వేరే తుపాకులు యిచ్చారు ఈ తుపాకులైనా 21 కి.మీలోని లక్ష్యాలను మాత్రమేఛేదించగల్గాయి. అంటే 30 కి.మీ దూరములోని లక్ష్యాలను సైతం ఛేదించే తుపాకులను సమకూర్చాలన్న రక్షణశాఖ ప్రయత్నం నీరుగారి పోయింది. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే యీ తుపాకులను ప్రయోగాత్మకంగా పరిశీలించేటప్పుడే కొన్ని విభాగాలు వూడిపోయాయట ! తిరిగి కొన్ని విడిభాగాలు స్వీడను నుండి వచ్చే వరకు ఆ పరిశీలనే ఆగిపోయిందట ! లోక్‌సభలో నేను యీ భోఫార్సు తుపాకుల కొనుగోలు గురించి ప్రస్తావన చేసిన నాటికి యీ కుంభకోణం అధికారికంగా బహిర్గతం కాలేదు. ప్రస్తుతం వెలువడిన వార్తల నేపథ్యములో యీ కొనుగోళ్ళు గురించి అనుమానాలు మరింత బలపడుతున్నాయి. కాబట్టి పార్లమెంటు ద్వారా ప్రజల ముందు వాస్తవాలను వుంచవలసిన కర్తవ్యం ప్రభుత్వానిదే.

మనం ఏటా షుమారు రూ. 12000 కోట్లు రక్షణ పద్దు క్రింద ఖర్చు పెడుతున్నాం ఇందులో షుమారు నాలుగు నుండి ఆరువేల కోట్లరూపాయలు రక్షణ సామగ్రి కొనుగోలు కోసం వ్యయమవుతుంది. దేశ రక్షణను దృష్టిలో వుంచుకొని నేను కాని నా సహచర గౌరవ సభ్యులెవరైనా కాని ఎంత మొత్తానైనా రక్షణ అవుసరాలకు కేటాయించడానికి వెనుకాడము.అయితే ఆ సొమ్ము దుబారా కాకూడదనేది నా భావన. ఏజెంటుకు యిచ్చిన రూ. 30 కోట్లును తిరిగి మనం కొన్న పరికరాల పైనే వేస్తారు.

మన ప్రభుత్వం చెల్లించవలసివుంటుంది. అంటే పన్ను చెల్లించే ప్రజలే యీ వ్యయాన్ని కూడా భరించవలసివుంటుంది.

ఈ సమస్యను సంకుచితమైన రాజకీయ దృక్పథము నుండి చూడవద్దని నా మనవి. ఎవరినో సాధించడానికి యీ విషయాన్ని పావుగా వాడవద్దు. ఈ రక్షణ పరికరాల కొనుగోళ్ళ కుంభకోణం గురించి వాస్తవాలను రాబట్టడానికి, విదేశీ సంస్థను ప్రభావితం చేసి ఏజెంటు కమీషను రాబట్టిన విధానాన్ని కనుగొనడానికి రక్షణ శాఖ కార్యదర్శిని విచారణ కమిటీగా రక్షణ మంత్రి శ్రీ వి. పి. సింగ్ నియమించితే దానిపై కొందరు విమర్శిస్తున్నారు. చాలా బాధ్యతాయుత స్థానాలలో వున్నవారు. కొందరు మంత్రులతో సహా యీ కమిటీ నియామకంలోని విజ్ఞతను ప్రశ్నిస్తున్నారు. మాజీ రక్షణ మంత్రి నీతి, నిజాయితీలపై వారు బురద జల్లుచూస్తున్నారు. దుష్ట చింతనతో యీ కమిటీని వేసాడని శ్రీ వి. పి. సింగ్‌పై వారు ధ్వజమెత్తుతున్నారు.

అధికార పార్టీలోని ఆంతరంగిక రాజకీయాలు మాకు అనవసరం. శ్రీ వి.పి. సింగ్ పార్టీ యెడల విశ్వాసం నాయకుని యెడల విధేయతతో తాను ఏ ఒక్కరికీ తీసి పోనని పలు పర్యాయములు చెప్పివున్నాడు. శ్రీ సింగ్ మంత్రిగా కొనసాగిన కాలంలో, తన పార్టీ లేక నాయకుని యెడల విధేయతకన్నా అధిక ప్రాధాన్యతను దేశ ప్రయోజనాలకు యివ్వవలసి వుంటుందని నేను యీ సభలో నొక్కి వక్కాణించ దలచాను. ఆ కోణము నుండే బహుశా ఆయన విచారణ కమిటీ నియామకానికి ఉత్తర్వు నిచ్చివుంటారు. అందులో తప్పేమిటి ?

బొంబాయిలో జరిగిన కాంగ్రెసు శత జయంతి వుత్సవాలలో "భారతదేశాన్ని నిర్మించే మహోద్యమాన్ని" చేపట్టమని కాంగ్రెసు పార్టీ అధ్యక్షునిగా శ్రీ రాజీవ్ గాంధీ పార్టీ కార్యకర్తలకు పిలుపు యివ్వలేదా ? ఏ మాత్రం వెనుకాడని రీతిలో అవినీతిపై పోరాటాన్ని సాగించడానికి, స్వచ్ఛమైన సామాజిక, రాజకీయ వాతావరణాన్ని ఏర్పాటు చేయడానికి కాంగ్రెసు పార్టీ చేసే కృషి యీ మహోద్యమంలో ముఖ్యమైన అంశమని శ్రీ రాజీవ్‌గాంధీ చెప్పివుండలేదా అని నేను ప్రశ్నిస్తున్నాను. అయితే యీ మాటలన్నీ కేవలం ప్రజల వినడానికి మాత్రమేనా ? బొంబాయిలో ప్రతిధ్వనించిన ఆశయాల సాధనకై అధికారపార్టీ చిత్తశుద్ధితో కట్టుబడి వుందా ? లేదా ? అనే విషయం ప్రభుత్వం స్పష్టం చేయడం మంచిది.

కమిటీని నియమించడంలో మాజీ రక్షణ మంత్రి తన పరిధులలోనే వ్యవహరించారు. కమిటీని నియమించి, ఆ నియామకం గూర్చి బహిర్గతం చేయడం వలన దేశ ప్రయోజనాలకు భంగం కల్గుతుందని నాకు ముందు మాట్లాడిన సీనియర్ గౌరవ సభ్యుడు శ్రీ భగవత్ ఝూ అజాద్ వెలుబుచ్చిన అభిప్రాయంతో నేను ఏకీభవించ

లేక పోతున్నాను. పైపెచ్చు యీ చర్చ మంచిదని, దీని వలన భారత ప్రభుత్వ కొనుగోళ్ళలో ఏజెంట్లకు పాత్ర వుండరాదు. అనే విషయం మరింత స్పష్టం చేయబడి భవిష్యత్తులో కమీషను యివ్వకుండేదానికి, యిప్పటికి యిస్తూ వుంటే మన ప్రభుత్వానికి సమాచారం అందే దానికి యీ చర్చ వుపకరిస్తుందని నేను భావిస్తున్నాను. ప్రభుత్వముయొక్క ప్రతిష్ట పెరుగుతుంది. ప్రజల మనసులలోని అనుమానాలను నివృత్తి చేయడానికి యిది దోహదం చేస్తుంది.

దేశంలోని అన్ని కీలక రంగాలకు వ్యాపిస్తున్న అవినీతిని అరికట్టడానికి అందరం పోరాడవలసివుంది. దళారీలకు ముట్టిన కోట్లాది రూపాయలను, సరకులకు, ఎక్కువ ధర రూపంలో మన ప్రభుత్వం చెల్లించవలసి వుంటుంది. ఇటు వంటి చర్యల వలన మన దేశ రక్షణ పాటవం దెబ్బతింటుంది కూడా. రక్షణశాఖ క్రింద చాలా దుబారా జరుగుతున్నదనే అపప్రథను తొలగించడానికి రక్షణశాఖ కొనుగోళ్ళ గురించి ప్రజల మనసులలో కల్గిన అనుమానాలను నివృత్తి చేయడానికి యీ రక్షణ పరికరాల కొనుగోలు, యిటువంటి యితర కొనుగోళ్ళపై వెంటనే శ్వేత పత్రం ప్రచురించాలని ప్రభుత్వాన్ని నేను డిమాండు చేస్తున్నాను. అంతేకాక యీ వ్యవహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, నిజాలను కనుగొనేందుకు సభా సంఘాన్ని నియమించాలని కూడా నేను కోరుతున్నాను.

రక్షణ శాఖకు అనుబంధంగా ఒక పార్లమెంటరీ స్థాయీ సంఘమును ఏర్పరచి, రక్షణ పరికరాల కొనుగోళ్ళ గురించి రహస్యంగా విచారించి, అవసరమైతే నిపుణులతో చర్చించి, ప్రభుత్వానికి తగు సూచనలు యిచ్చే అధికారాలను యీ కమిటీకి యివ్వాలని నేను సూచిస్తున్నాను. అంతే కాక యీ విషయం గురించి యిద్దరు మంత్రులు రాష్ట్రపతి వివరణ యిచ్చిన సందర్భములో, రాష్ట్రపతి మరి కొన్ని వివరణలు అడిగిన వైనాన్ని గమనంలో వుంచుకొని, యీ సభను విశ్వాసంలోకి తీసుకొని అన్ని విషయాలను సభ ముందు వుంచాలని మంత్రి వర్యులను కోరుతూ సెలవు తీసికొంటున్నాను.